క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయోత్పత్తులతో ఆరోగ్యం



కూరగాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

వంగర: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రకృతి వ్యవసాయోత్పత్తుల విక్రయాలు మంగళవారం జరిగాయి. సేంద్రియ ఎరువులు, ప్రకృతి సాగు విధానాలు అవలంబిస్తూ పండించిన పంటలు ఆరోగ్యానికి మంచివి కావడంతో అందరూ వాటిని కొనుగోలు చేసేందుకు పోటీపడ్డారు. ఈ సందర్భంగా కొనుగోలుదారులకు ప్రకృతి సేద్యం, ప్రకృతి సాగు ఉత్పత్తుల లాభాలను ప్రకృతి సేద్యం సిబ్బంది ఆర్నిపల్లి సింహాద్రినాయుడు వివరించారు.

జర్నలిస్టుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు, ప్రజాసంఘాల నాయకులు

మెంటాడ: మక్కువ మండల ప్రజాశక్తి విలేకరిపై ఆ మండల టీడీపీ నాయకుడు దాడికి పాల్పడడాన్ని జర్నలిస్టులంతా వ్యతిరేకించారు. స్థానిక తహసీల్దారు ఎదుట సీపీఎం, ప్రజాసంఘాల నాయకులతో కలిసి మంగళవారం నిరసన చేపట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ మధ్యకాలంలో జర్నలిస్టులపై దాడులు జరుగుతుండడం విచారకరమన్నారు. ఇది పత్రికా స్వేచ్ఛను హరించడమేనన్నారు. ప్రజాప్రతినిధులంటే ప్రజలకు సాయం చేయాలే తప్ప ఇలా దాడులు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాకోటి రాములు, గొర్లె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలుదారులపై చర్యలు తీసుకోండి

తెర్లాం: మండలంలోని నందబలగ గ్రామంలో ఎస్సీ, ఎస్టీల డీ–పట్టా, ప్రభుత్వ, పోరంబోకు భూములు కొనుగోలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట అప్పన్న డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన.. తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. సదరు వర్గాల ప్రజలు సాగు చేసుకుంటున్న భూములను కొంతమంది పెత్తందారులు బెదిరించి, వారి భూములు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఆ భూములపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరారు. సర్వే చేసి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

మామిడికాయల సంరక్షణపై రైతులకు శిక్షణ



రైతులకు సూచనలు చేస్తున్న ఉద్యానవన శాఖాధికారి మోహన్‌కృష్ణ

తెర్లాం: మామిడికాయలకు సంచులు(ఫ్రూట్ కవర్స్) కట్టడం ద్వారా మామిడికాయల నాణ్యత పెరిగి అధిక ధరకు మార్కెట్‌లో అమ్ముడుపోతుందని రామభద్రపురం ఉద్యానవన శాఖ అధికారి పి.మోహన్‌కృష్ణ తెలిపారు. మండలంలోని లోచర్ల గ్రామ సచివాలయంలో మామిడిని ఆశించే తెగుళ్లు, పురుగులు, మామిడికాయల సంరక్షణ తదితర అంశాలపై మామిడి రైతులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ మంచు కారణంగా మామిడి పంటను తెగుళ్లు, పురుగులు ఆశిస్తున్నాయని, వాటిని నివారించి, పూత, పిందెను ఏ విధంగా కాపాడుకోవాలో అవగాహన కలిగి ఉండాలన్నారు. మామిడి తోటల్లో రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోండి

రాజాం సిటీ: సచివాలయాల ద్వారా అందిస్తున్న ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు కోరారు. మండలంలోని అంతకాపల్లిలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ఆధార్‌లో తప్పులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఆరేళ్ల వయసు లోపు చిన్నారులకు కొత్త ఆధార్‌కార్డు చేయించుకోవాలని తెలిపారు.

బాడంగి: మండలంలోని కోటిపల్లి గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను ఎంపీడీవో ఎస్.రామకృష్ణ మంగళవారం పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. బాలలకు కొత్త ఆధార్‌కార్డులు చేయడంతో పాటు, పాత కార్డుల్లో తప్పొప్పులు సవరించాలని తెలిపారు.

సర్వే పూర్తి చేయండి

బొబ్బిలి: ఎంఎస్ఎంఈ సర్వే పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సూచించారు. స్థానిక పట్టణంలోని సచివాలయాలను ఆమె మంగళవారం సందర్శించి, సిబ్బందికి సూచనలు చేశారు. చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేయాలని, ప్రజలకు అవసరమైన పౌరసేవలు సకాలంలో అందేలా చూడాలన్నారు.

● 10 గంటలైనా మంచు వదలదాయె!



ఉదయం 10 గంటలైనా పొగమంచు వీడడం లేదు. రాత్రి 10 గంటల నుంచి ఎడతెరిపిలేకుండా కురుస్తున్న మంచుతో ఏది ఎక్కడుందో కనిపించడం లేదు. అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు వెళ్లడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణం చేసే వారు అయితే లైట్లు వేసుకుని మరీ వెళ్తున్నారు. అయినా అంతంతమాత్రమే కనిపిస్తోందని చెబుతున్నారు. ఇంకా ఎన్నాళ్లు ఇలా వాతావరణం ఉంటుందోనని అంటున్నారు. ఈ చిత్రంలో కనిపిస్తోంది.. రేగిడి మండలం, అంబకండి–ఉంగరాడమెట్ట దారిలో మంగళవారం కురిసిన పొగమంచు దృశ్యం. – రేగిడి

● జర్నలిస్టులపై దాడులు తగవు



జర్నలిస్టులపై దాడులు తగవని రామభద్రపురం మండల జర్నలిస్టులు ఖండించారు. పార్వతీపురం మన్యం జిల్లా, మక్కువ మండలం ప్రజాశక్తి విలేకరిపై దాడికి పాల్పడిన టీడీపీ నాయకుడు గుల్ల వేణుగోపాల్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారంతా కలిసి రామభద్రపురం తహసీల్దారు సులోచణరాణికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. పత్రికా స్వేచ్ఛను హరించాలనుకోవడం సరికాదన్నారు. – రామభద్రపురం

● గెడ్డ బాగు చేయరూ?




ఆకులోవకట్ట(ఏకేఎల్) గెడ్డ రోజురోజుకూ కుచించుకుపోతోంది. ఉనుకూరు నుంచి ఆమదాలవలస వరకు విస్తరించి ఉన్న ఈ గెడ్డ ద్వారానే ఆరు వేల ఎకరాలకు సాగునీరు వెళుతోంది. ప్రస్తుతం రేగిడి మండలం, వెంకంపేట వద్ద గెడ్డ ఆక్రమణకు గురై చిన్నది అయింది. దీంతో పొలాలకు సాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. ఒకప్పుడు 200 మీటర్ల విస్తీర్ణం ఉండే ఈ కాలువ ఇప్పుడు 50 మీటర్లుగా ఉందంటే ఏ మేర కబ్జాకు గురైందో అర్థం చేసుకోవచ్చు. అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించి, గెడ్డను బాగు చేయాలని రైతులు కోరుతున్నారు. – రేగిడి

రైతు నెత్తిన.. పెట్టుబడి భారం!



సంతకవిటి మండలంలోని మద్దూరుపేట దగ్గరలో రబీ వరి సాగు



- పెరిగిన పెట్టుబడులు.. తగ్గిన దిగుబడులు
- వేధిస్తోన్న కూలీల కొరత
- కష్టంగా పంటల సాగు
- ఆదుకోవాలని అన్నదాతల విజ్ఞప్తి

రాజాం: రైతును సాగు కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఓ వైపు పెరిగిన పెట్టుబడులు మరోవైపు కూలీల కొరత అన్నదాతను తీవ్రంగా వేధిస్తున్నాయి. దీనికితోడు పంటకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించడం లేదు. ఫలితంగా సాగు నష్టమే కానీ లాభం లేదని, తప్పనిసరి పరిస్థితుల్లో వ్యవసాయం చేయాల్సి వస్తోందని అంతా వాపోతున్నారు. ఒక్కోసారి భూమిని కౌర్కు వదిలేస్తే బాగుణ్ను అనిపిస్తోందని అన్నదాత ఆవేదన చెందుతున్నాడు. ముఖ్యంగా రబీ సీజనల్‌లో పంటల సాగు కష్టంగా ఉందని, పంటమార్పిడి చేసినా ఫలితం కనిపించడం లేదని అంటున్నారు. ప్రభుత్వమే సాగు సాయం అందించి, ఆదుకోవాలని కోరుతున్నారు.

● 40 శాతం పెట్టుబడులు పెరిగాయి..

రాజాం నియోజకవర్గంలో 32 వేల ఎకరాల్లో రబీ సాగు జరుగుతోంది. రాజాంతో పాటు రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లో కూరగాయల సాగుతో పాటు వరి, వేరుశనగ, ఉలవలు, అపరాలు, మొక్కజొన్న, రాగి, నువ్వు తదితర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. గతంతో పోలిస్తే ఆయా పంటల సాగులో పెట్టుబడులు 40 శాతం మేర పెరిగాయి. కూటమి ప్రభుత్వం ఎరువుల ధరకు కళ్లెం వేయకపోవడంతో పాటు మద్దతు ధరకు పంటను కొనుగోలు చేయకపోవడంతో దళారీలే రైతుకు దిక్కుగా మారారు.

● పెరిగిన ధరలు..

గతంలో కన్నా ప్రస్తుతం సాగుకు ఉపయోగించే ఎరువుల ధరలు, పనికి వచ్చే కూలీల కూలిధరలు పెరిగాయి. గతంలో మగకూలీకి రూ.400 నుంచి రూ.500, ఆడకూలీకి రూ.200లు చొప్పున రోజువారీ కూలి ఉండేది. ఇప్పుడు మగ కూలీకి రూ.600, ఆడకూలీకి రూ.300లు చెల్లించాల్సి వస్తోంది. వీటికి తోడు ఎరువుల ధరలు భారీగా పెరిగాయి. ఓ యూరియా బస్తా ధర రూ.300లు దాటి విక్రయిస్తున్నారు. డీఏపీ ఎరువు గతంలో రూ.800లు ఉంటే ఇప్పుడు రూ.1500. పొటాష్ బస్తా ధర రూ. 1700లకు పెరిగింది. పురుగుమందుల ధరలు కూడా అమాంతంగా పెరిగాయి. దిగుబడులు చూస్తే రబీ వరి ఎకరాకు 25 బస్తాలు కూడా రాని పరిస్థితి కనిపిస్తోంది. మొక్కజొన్న దిగుబడి 28 నుంచి 26 బస్తాలకు పడిపోయింది. వేరుశనగ 6 నుంచి 8 బస్తాల దిగుబడి మాత్రమే వస్తోంది. పెసర, మినప బస్తాలు ఎకరాకు 2 క్వింటాళ్లు రావడం గగనంగా మారిపోయింది. ఎరువులు, పురుగుమందుల ధరల పెరుగుదలపై రాజాం వ్యవసాయశాఖ ఏడీఏ కె.చంద్రరావు వద్ద సాక్షి ప్రస్తావించగా, ప్రస్తుతం ప్రభుత్వ రాయితీపై ఎరువులు లేవని, ప్రైవేటు వ్యాపారుల వద్ద ఎరువులను రైతులు కొనుగోలు చేస్తున్నారన్నారు. ఎక్కడైనా నిబంధనలు అతిక్రమించి అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

దీంతో పెరిగిన పెట్టుబడులకు తగ్గట్టుగా పండించిన పంట నుంచి ఫలసాయం పొందని దుస్థితి.

ఆశించినంతగా దిగుబడి లేదు..

ఈ ఏడాది మా పొలాల్లో మొక్కజొన్న పంట వేశాం. గతంలో పెద్దగా పెట్టుబడి అవ్వలేదు. ఇప్పుడు ఎకరా సాగుకు 6 యూరియా బస్తాల ఎరువు వేయాల్సి వచ్చింది. వీటికి తోడు పొటాష్, చీడపీడల నివారణ మందులు వేశాం. ఎకరా సాగుకు రూ.18 వేల పెట్టుబడి అవుతోంది. దిగుబడి ఆశించినంతగా రాలేదు.

– బి.అప్పలనాయుడు, రైతు, వన్నలి, రేగిడి మండలం

పంటలు ఆశాజనకంగా లేవు..

రబీ సీజన్‌లో పండించే అపరాల పంటలు ఆశాజనకంగా లేవు. పెట్టుబడి, కూలీలకు ఇచ్చిన డబ్బులే రాలేదు. నీటి వనరులున్నాయని వరి సాగు చేస్తున్నాం. దీనికి విత్తనాల దగ్గర నుంచి ఎరువులు, కూలీలకు ఇచ్చే డబ్బులు ఖరీఫ్ సాగు కన్నా ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఖరీఫ్ వరి ధాన్యానికి కూడా మద్దతు ధర రాలేదు.

– వి.ఎస్.నాయుడు, రైతు, మద్దూరుపేట, సంతకవిటి మండలం

ఆటపాటలతో కూడిన విద్యనందించాలి

జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు వృత్తి నైపుణ్య శిక్షణ మంగళవారం ప్రారంభమైంది. మండల కేంద్రాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఆరు రోజుల పాటు వారికి కల్పిస్తున్న ఈ శిక్షణా తరగతుల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రీ స్కూల్ నిర్వహణతో పాటు చిన్నారులకు విద్యాబోధన చేయడంపై శిక్షణ ఇస్తున్నారు. ప్రీ స్కూల్ పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యనందివ్వాలని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందివ్వాల్సిన పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని అధికారులు కోరారు. అలాగే శిక్షణలో నేర్చుకునే అంశాలు కేంద్రాల్లో వినియోగించి, పిల్లల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

– బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్



రాజాం: అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలిస్తున్న డీఈవో మాణిక్యంనాయుడు



వంగర: శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ఎంఈవో జగదీశ్వరి



బొబ్బిలి: శిక్షణార్థులకు సూచనలిస్తున్న అధికారులు



బాడంగి: అంగన్‌వాడీల శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

రోడ్డు విస్తరణకు సహకరించండి



మాట్లాడుతున్న ఎస్‌ఐ ప్రసాదరావు

రామభద్రపురం: మండల కేంద్రంలోని రోడ్డు విస్తరణకు వ్యాపారులు, ఇంటి యజమానులు సహకరించాలని ఎస్‌ఐ వి.ప్రసాదరావు కోరారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రోడ్డు పక్కనే ఉన్న దుకాణాదారులు, ఇళ్ల యజమానులతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు.

రోడ్డుకు ఇరువైపులా కొంతమేర రోడ్డు ఆక్రమణకు గురైందని, దాంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందన్నారు. ప్రజలు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారన్నారు. రోడ్డు భాగం ఆక్రమించిన వారు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించాలని సూచించారు. ఈ మేరకు వారు కూడా అంగీకరించినట్లు తెలిపారు. పోలీస్‌తో పాటు రెవెన్యూ, పంచాయతీ, ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి కొలతలు వేసి ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

సమయపాలన పాటించాలి



పెనుబాక సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం సిటీ: మండలంలోని పెనుబాక, శ్యాంపురం గ్రామాల్లోని సచివాలయాలను ఎంపీడీవో వి.శ్రీనివాసరావు మంగళవారం సందర్శించారు. అనంతరం ఉద్యోగుల హాజరు పట్టీతో పాటు పలు రికార్డులను ఆయన తనిఖీ చేశారు. ఎంఎస్ఎంఈ సర్వే, హౌస్‌హోల్డ్ జియో సర్వే, మిస్సింగ్ సిటిజన్ డేటా ఎంట్రీ, పీఏసీఎస్ ఈకేవైసీ, చైల్డ్ ఆధార్ నమోదుపై సమీక్ష చేశారు. సిబ్బంది అంతా సమయపాలన పాటించి, పెండింగ్ పనుల పూర్తిపై దృష్టి సారించాలని తెలిపారు.

బొబ్బిలిరూరల్: మండలంలోని జగన్నాథపురం, కోమటిపల్లి గ్రామ సచివాలయాలను ఎంపీడీవో పి.రవికుమార్ మంగళవారం సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలకు అవసరమైన పౌరసేవలను వారికి సక్రమంగా అందించాలని తెలిపారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి



ఎమ్మెల్సీ విక్రాంత్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న షేక్ సలీం

రేగిడి: వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన రేగిడి మండలం, తాటిపాడుకు చెందిన షేక్ సలీం.. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ను పాలకొండలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తనను మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా నియమించినందుకు గాను పార్టీ అధినేత వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేయాలని, పార్టీ కోసం పనిచేసిన వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్సీ అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టి.అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వి.జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు

రాజాం సిటీ: అంకితభావంతో పనిచేసి రోగులకు మెరుగైన వైద్యం అందించాలని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు కోరారు. స్థానిక ఆదర్శ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ ప్రథమ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని సూచించారు. వైద్యాధికారి యు.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ అర్బన్ హెల్త్ సెంటర్‌లో 60 రకాల వైద్య పరీక్షలతో పాటు 175 రకాల మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనంతరం సేవలందించిన రాంబాబు, హరిబాబులకు ప్రభావతి జాగృతి ట్రస్టు వ్యవస్థాపకులు సప్పటి వసంతరావు జ్ఞాపికలు బహూకరించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోండి



ఎంపీడీవో కార్యాలయ అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీ డిప్యూటీ సీఈవో వెంకటేశ్వరరావు

బొబ్బిలిరూరల్: రానున్న వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పలు విభాగాల కార్యాలయాలను ఆయన మంగళవారం సందర్శించారు. మౌలిక సదుపాయాలు లేని, ఇరుకైన గదుల్లో విధులు ఎలా నిర్వహిస్తున్నారని సిబ్బందిని అడిగారు. కొత్త భవనాల నిర్మాణానికి నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. మండల పరిషత్ పాత భవనానికి మరమ్మతులు చేసి, డీఎల్‌డీవో కార్యాలయం కింద వినియోగించుకోవాలని ఆయన సూచించారు. మండల పరిషత్ నిధులతో గ్రామాల్లో పాడైన తాగునీటి బోర్లు బాగు చేయాలని తెలిపారు. ఆయన వెంట డీఎల్‌డీవో కిరణ్‌కుమార్, ఎంపీడీవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కంపోస్ట్ పిట్ ఏర్పాటు చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ చిరంజీవి

రాజాం: ప్రతి ఇంటి వద్ద కంపోస్ట్ పిట్ ఏర్పాటు చేసుకోవాలని మహిళా సంఘాల మహిళలకు వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ ఎ.చిరంజీవి సూచించారు. స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెనుబాక గ్రామంలో కంపోస్ట్ పిట్ ఏర్పాటు సహా పరిసరాల పరిశుభ్రత దాని ద్వారా కలిగే ప్రయోజనాలపై మంగళవారం అవగాహన కల్పించారు. అందరూ ఇంటి వెనకాల గొయ్యిలు(కంపోస్ట్ పిట్) తవ్వుకుని, అందులో ఇంటి వ్యర్థాలు వేసుకుని, ఎరువు తయారు చేసుకోవాలని తెలిపారు. ఇలా తయారైన సేంద్రియ ఎరువును పొలాల్లో వేసుకుంటే ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వంగర: మండలంలోని తలగాం గ్రామంలో గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులతో వెలుగు సీసీ బాలు సమావేశమై, కిచెన్ గార్డెనింగ్, హోమ్ కంపోస్టింగ్‌లపై అవగాహన కల్పించారు.

క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన

వంగర: మండల కేంద్రంలో క్షయవ్యాధి నిర్మూలనపై మంగళవారం అవగాహన కల్పించారు. వ్యాధి లక్షణాలు–నివారణ చర్యలను వైద్యారోగ్య సిబ్బంది వివరించారు. కార్యక్రమంలో ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మద్యంసీసాల స్వాధీనం

బొబ్బిలి: పట్టణంలోని ఓ మద్యం దుకాణం నుంచి మద్యం బెల్టుషాపులకు తరలిస్తున్న 8 మద్యంసీసాలు మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు మంగళవారం తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి, గొల్లపల్లికి చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. ప్రస్తుతం అతడిని రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించామన్నారు.

భూ ఆధార్ చేసుకోవాలి

వంగర: రైతులంతా భూ ఆధార్(ఫార్మర్ రిజిస్ట్రీ) తప్పనిసరిగా చేసుకోవాలని ఏవో తట్టికోట కన్నబాబు సూచించారు. మండలంలోని మద్దివలస, శివ్వాం గ్రామాల్లో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని, రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీపై అవగాహన కల్పించారు. సొంత భూమి కలిగిన ప్రతీ రైతు తమ వివరాలను నమోదు చేసుకుని, 14 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలని, తద్వారా కేంద్ర, రాష్ట్ర వ్యవసాయ సంబంధిత పథకాలు వస్తాయన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

బొబ్బిలి: రిమాండ్ ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని టీబీ సూపర్‌వైజర్ ఆర్.శ్రీదేవి సూచించారు. స్థానిక సబ్‌జైలులో క్షయవ్యాధి నిర్మూలనపై మంగళవారం అవగాహన కల్పించారు. టీబీ అంటువ్యాధి కాదు అని, కాస్త జాగ్రత్తగా ఉంటే చాలు వ్యాధి బారినపడకుండా ఉండొచ్చని ఆమె తెలిపారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

తెర్లాం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యమని వార్డెన్ ఎస్.దాసు అన్నారు. స్థానిక బీసీ వసతిగృహంలో మంగళవారం తెల్లవారుజామున పదో తరగతి విద్యార్థులకు స్టడీ అవర్ నిర్వహించారు. చదువులో వెనకబడిన విద్యార్థులు విద్యాప్రగతి సాధించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

పర్మినెంట్ చేస్తానని.. ఇదేం పని?

బొబ్బిలి: రాష్ట్రంలో ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తానని చెప్పి, ఇప్పుడు ఆప్కాస్ వ్యవస్థను రద్దు చేసి వారి ఉద్యోగాలకు ఎసరు పెట్టడం సరికాదని, ఇదేం పని అని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు నిలదీశారు. స్థానిక వేణుగోపాల స్వామి ఆలయ మండపం ఎదురుగా మున్సిపల్ కార్మికుల సాధారణ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఆప్కాస్ రద్దు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ త్వరలో జరగబోయే శాసనసభా సమావేశాలు అట్టుడికిపోయేలా చేస్తామని హెచ్చరించారు.